క్లుప్తంగా

ప్రతిభకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న సావిత్రి



అనిత

తిరుపతి సిటీ : విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో పలు విభాగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. సోమవారం ప్రపంచ ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా విద్యావిభాగంలో సేవలందించిన పద్మావతి మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.అనిత, సామాజిక సేవారంగంలో నిరంతర కృషి చేసి ఎంతో మంది మహిళా సంఘాలకు ఆసరాగా నిలిచిన పవర్ ఆర్గనైజేషన్ సంస్థ అధినేత సావిత్రికి నంది అవార్డులు అందించారు.

డిగ్రీ తొలి సెమిస్టర్ ప్రారంభం



తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్, ఎస్పీడబ్ల్యూ కళాశాలల్లో సోమవారం డిగ్రీ తొలి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అటానమస్ హోదాలో తొలిసారిగా నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి మొదటి రోజు ఇంగ్లిష్ పేపర్-1కు మొత్తం 2,824 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

సమస్య పరిష్కారమే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

తిరుపతి తుడా : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం గ్రీవెన్స్ నిర్వహించినట్లు కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 32 వినతులు వచ్చినట్లు వెల్లడించారు. అందులో ముఖ్యంగా కొర్లగుంటలో డ్రైనేజీల ఏర్పాటు, ప్రజలకు వైద్యపరీక్షలు చేయించాలని, ఇంటి స్థలం ఇప్పించాలని, టీడీఆర్ బాండ్లు అందించాలని తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో రైతుదినోత్సవం



రైతులను సత్కరిస్తున్న శ్రీచైతన్య ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్‌లో సోమవారం ఘనంగా రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముకని, రైతన్న సేవలు దేశ ప్రగతికి చక్రాలని వివరించారు. అనంతరం రైతులను ఏజీఎం సురేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ రవిబాబు పాల్గొన్నారు.

సేంద్రియ రైతుకు 'పుడమి మిత్ర'



అవార్డు అందుకుంటున్న నాంచారమ్మ

పాకాల : తెలంగాణలోని యాదగిరిగుట్టలో ఆదివారం నిర్వహించిన గాంధీ విజ్ఞాన్ సదస్సులో మండలంలోని గానుగ పెంట పంచాయతీ శ్రీరామాపురానికి చెందిన నాంచారమ్మ అనే రైతుకు పుడమి మిత్ర అవార్డు లభించింది. మామిడి తోట, అంతరంగా వేరు శనగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేయడం ద్వారా నాంచారమ్మకు అరుదైన గౌరవం దక్కింది. అలాగే మహిళా సంఘాలను సేంద్రియ సాగులో భాగస్వాములు చేసినందుకు జిల్లా స్థాయి ఉత్తమ కార్యకర్తగా, ప్రకృతి వ్యవసాయ రైతుగా మరో అవార్డు కూడా వరించింది. నాంచారమ్మ మాట్లాడుతూ రైతులు పలు రకాలైన పంటలు ఒక క్రమ పద్ధతిలో సాగుచేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గి సమాంతర దిగుబడి వచ్చేందుకు అవకాశాలు ఉంటాయని వెల్లడించారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి క్రైం: నగరంలోని సత్యనారాయణపురంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు సోమవారం దాడి చేశారు. నిర్వాహకురాలు దాసరి కుమారితోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అలిపిరి ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

ఏ-బ్లాక్ ప్రధాన రహదారి దుస్థితి



కాలువలా మారిన దారి



పూర్తిగా ఛిద్రం.. రాకపోకలు ఎలా మరి..?



గూడు కుదిరె.. దారి చెదిరె!

- తొండవాడ జగనన్న కాలనీలో సమస్యలు
- అధ్వాన్నంగా మారిన అంతర్గత రోడ్లు
- అడుగు వేసేందుకు సైతం అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ఇక్కట్లు
- ఆవేదన చెందుతున్న లబ్ధిదారులు

నిరుపేదలకు నీడ కల్పించాలి. సొంతింటిలో సగౌరవంగా నివసించే అవకాశం అందించాలి. బడుగు బతుకులపై అద్దె భారం తప్పించాలి. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగుల వేసింది. లక్షలాది మంది స్వగృహ స్వప్నాలను సాకారం చేసింది. అందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గం తొండవాడలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించింది. వేలాది మందికి పక్కా ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు నివాసాలు నిర్మించుకునేందుకు సహకారం అందించింది. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత పేదల కాలనీలపై శీతకన్ను వేసింది. దీంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గతంలో వేసిన దారులు ఛిద్రమైనా స్పందన కరువైంది. లబ్ధిదారులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురించింది.

చంద్రగిరి : మండలంలోని తొండవాడ జగనన్న కాలనీలో సుమారు 7వేల మందికి పైగా లబ్ధిదారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో సుమారు వెయ్యి ఇళ్లకు పైగా నిర్మాణం పూర్తయింది. అందులో లబ్ధిదారులు నివసిస్తున్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీలోని రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. గృహ నిర్మాణాలకు సైతం సామగ్రిని తరలించుకునేందు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఏ-బ్లాకులో మరింత దుర్భరం

జగనన్న కాలనీ ఏ బ్లాకులో చంద్రగిరి వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో ఏ-బ్లాకులోకి వర్షపు నీరు చేరింది. దీంతో దారులు కోతకు గురికావడంతోపాటు బురదమయంగా మారిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన కరువు

కాలనీలో రోడ్ల స్థితిగతులపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారిపోయాయని, రాళ్లు తేలడంతో అడుగు వేయలేకపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సామగ్రి తరలించుకోవడం సవాల్‌గా మారిందని వాపోతున్నారు. కనీసం ద్విచక్రవాహనాలు కూడా రాకపోకలు సాగించలేని దుస్థితి దాపురించిందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, తమ కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు. ముఖ్యంగా రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని స్పష్టం చేస్తున్నారు.



ఈ బురద మార్గంలో అడుగు పెడితే అంతే..!

ఆపన్నహస్తం కోసం వినతి



మాట్లాడుతున్న బాధితుడి తల్లి సరస్వతి

తిరుపతి కల్చరల్ : క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడు కౌశిక్ చికిత్సకు ఆపన్న హస్తం అందించాలని బాధితుడి తల్లి సరస్వతి విన్నవించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. కౌశిక్‌కు వైద్యులు విజయవంతంగా ఆపరేషన్ చేశారన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కావడంతో ఆయన ఫ్యాన్స్ కూడా స్పందించి రూ.2లక్షలు సాయం చేశారన్నారు. అయినప్పటికీ ఆస్పత్రిలో రూ.20లక్షల ఫీజు బకాయి ఉందని, నిరుపేదలమైన తమకు అంత సొమ్ము చెల్లించే స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ఆదుకోవాలని కోరారు.

మామిడి రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శివకుమారి

భాకరాపేట : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మామిడిలో పూత ఆలస్యం అవుతుందని చిన్నగొట్టిగల్లు మండల ఉద్యాన శాఖాధికారి శివకుమారి తెలిపారు. సోమవారం క్షేత్ర స్థాయిలో మామిడి తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మామిడిలో ఒకేసారి పూత రావడం కోసం పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తోటలో నిలిచిన నీరు ఆవిరయ్యేందుకు తేలికపాటి దున్నకాలు చేపట్టాలని సూచించారు. అవసరమైనవారు సలహాల కోసం సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

భూమనను విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదని, రాజకీయ లబ్ధి కోసం అన్నా అనితాయాదవ్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతిలో నాణ్యమైన రోడ్లు వేయలేదని, వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి జరగలేదని కార్పొరేటర్ అన్నా అనితాయాదవ్ విమర్శించడం విడ్డూరమన్నారు. భూమన అభినయరెడ్డి సూచనతో భూమన చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ బీఫారమ్ పొంది కార్పొరేటర్‌గా గెలిచారని గుర్తు చేశారు. ఏమాత్రం నైతికవిలువలు ఉన్నా ముందు పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని స్పష్టం చేశారు. గతంలో తనకు రాజకీయ జీవితం ఇచ్చింది భూమన కరుణాకరరెడ్డి అని వెల్లడించిన అనితా యాదవ్, ఇప్పుడు ఈ విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. జీవకోన రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. అప్పట్లో చంద్రబాబు నాయుడుపై విమర్శలు గుప్పించిన అనితాయాదవ్, ఇప్పుడు కూటమిలో చేరి నోటికొచ్చినట్లు ఆరోపణలు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ రాజకీయాలు చేయడం మానుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు అరుణ్ యాదవ్, బ్రహ్మానందం, చింతా రమేష్, అశోక్ పాల్గొన్నారు.

నైపుణ్యం కూడిన విద్యతోనే లక్ష్యం సాధ్యం



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న జీఎస్ఎన్ నేతలు

తిరుపతి సిటీ: విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను అందిపుచ్చుకున్నప్పుడే జీవిత లక్ష్యాన్ని సాధించొచ్చని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. సోమవారం వర్సిటీ సెనేట్ హాల్‌లో గిరిజన నవ సమాజ్ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్యా శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించడానికి రూ.1,215 కోట్లను ప్రభుత్వం వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఎస్వీయూ పరిధిలో కూడా 20వేల చదరపు అడుగుల స్థలాన్ని ఇందు కోసం సమకూర్చామన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ వ్యక్తిగా సాధించలేని పనిని సమూహంగా ఏర్పడి కృషి చేస్తే సులువుగా సాధించవచ్చన్నారు. మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు అంతరాలను వీడి జీవితంలో లక్ష్యసాధన కోసం శ్రమించాలన్నారు. గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షు పాలిత్యా శివశంకర్ నాయక్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం, విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించుకోవడానికి తగిన కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. సినీ గాయకుడు దేవా, ఆనందయ్య ఆలపించిన భక్తి, సినిమా గీతాలు అలరించాయి. విశ్రాంత ప్రిన్సిపల్ పద్మనాభం, మసూమయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షులు బాలునాయక్, తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేంద్ర, వెంకటాద్రి, సూర్య పాల్గొన్నారు.

గణితశాస్త్రానికే అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

తిరుపతి సిటీ : అన్ని రంగాలు, సబ్జెక్టుల్లో గణితశాస్త్రానికే అధిక ప్రాధాన్యముంటుందని నెల్లూరు విక్రమ సింహపురి వీసీ ప్రొఫెసర్ ఎస్.విజయ్ భాస్కర్‌రావు తెలిపారు. ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మాథ్స్‌మ్యాటిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు సోమవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ గణితశాస్త్రంలో ఎంతో మంది ప్రముఖులు తమ ఆలోచనలు పదును పెట్టి అనేక ఫార్ములాలు కనుగొన్నారని వెల్లడించారు. గణితశాస్త్రం అభ్యసిస్తున్న యువత పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ విశ్రాంత వీసీ సరోజమ్మ, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.పద్మావతి, గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు సుగుణమ్మ, భారతి, సుధాకరయ్య, శ్రీనాథ్, వర్మ పాల్గొన్నారు

'పీఆర్ఎస్ఐ తిరుపతి'కి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న తిరుపతి చాప్టర్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : పబ్లిక రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్‌కు రెండు జాతీయ అవార్డులు లభించాయి. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లో సోమవారం నిర్వహించిన 46వ జాతీయ ప్రజా సంబంధాల సదస్సు ముగింపు కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. ఛత్తీస్‌ఘడ్ ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో చేతుల మీదుగా పురస్కారాలను తిరుపతి చాప్టర్ చైర్మన్ కె. శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్ అందుకున్నారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, ఉపాధ్యక్షుడు యూఎస్.శర్మ, ప్రధాన కార్యదర్శి పీఎల్‌కే.మూర్తి పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పురస్కారం

ప్రజా సంబంధాల వ్యాప్తిలో విశిష్ట సేవలు అందించినందుకు పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ శ్రీనివాసరావుకు ఔట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ అవార్డు లభించింది. జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ రవి, రమాకాంత శర్మ, చంద్రమోహన్‌రావు, ఆచార్య చక్రవర్తి రాఘవన్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఆర్‌సీకే రాజు హర్షం వ్యక్తం చేశారు.

సొమ్ము చెల్లించకుంటే జైలు

తిరుపతి లీగల్: చెక్ బౌన్స్ కేసులో ఫిర్యాదీకి నెల రోజుల్లో సొమ్ము చెల్లించకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తిరుపతి ఆరో అదనపు ప్రత్యేక మేజిస్ట్రేట్ రాణాప్రతాప్ సోమవారం తీర్పు చెప్పినట్టు న్యాయవాది దొరబాబు తెలిపారు. వివరాలు.. టీటీడీ ఉద్యోగుల క్యాంటిన్‌లో సర్వర్ గా విధులు నిర్వహిస్తున్న సి.సుబ్రమణ్యం తన అవసరాల కోసం తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన సి.హరి ప్రసాద్ వద్ద 2018 జూన్ 9వ తేదీన రూ.3.6లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2019 జూన్ 10వ తేదీన నాలుగు లక్షల 46 వేల రూపాయలు విలువచేసే చెక్కును హరిప్రసాద్‌కు ఇచ్చాడు. ఆయన సదరు చెక్కును బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయ్యింది. దీంతో హరిప్రసాద్ కోర్టును ఆశ్రయించాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నెలలోపు సుబ్రమణ్యం ఫిర్యాదీ హరిప్రసాద్‌కు ఆరు లక్షల 66 వేల 700 రూపాయలు చెల్లించాలని అలాగే 20 వేల రూపాయలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని తీర్పు చెప్పారు. లేకుంటే ఏడాది జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

52 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్



వైద్యశిబిరంలో డాక్టర్లు, మహిళలు

తిరుపతి తుడా : స్థానిక సప్తగిరినగర్‌లో సోమవారం 52 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాల, రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ సునీత మాట్లాడుతూ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. నివారణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డాక్టర్ లలిత, డాక్టర్ స్వాతి, డాక్టర్ శరోన్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక



మాట్లాడుతున్న వెంకటరత్నం

భాకరాపేట : దేశానికి రైతే వెన్నెముకని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం తెలిపారు. సోమవారం చిన్నగొట్టిగల్లులో నిర్వహించిన జాతీయ రైతు దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకటరత్నం మాట్లాడుతూ రైతులు ఆనందంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా అన్నదాతలకు శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. తక్కువ ఖర్చు, నీటితో అధిక దిగుబడులను ఇచ్చే కొత్త వంగడాలను పరిచయం చేస్తున్నట్లు వివరించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా 140 మంది కర్షకులకు రూ 1.10 లక్షల చొప్పున సంఘాల ద్వారా అందించామని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ రైతు లేక పోతే జీవరాశుల మనుగడే ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, స్కీమ్‌లపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ చంద్రమౌళి, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజ, వాణి, భార్గవి, వనజ, నాగేశ్వర్‌రావు, సీవీ నాయుడు పాల్గొన్నారు.

రైతు పోరాటాల అణచివేతను ఆపండి





కలెక్టరేట్ వద్ద జీవో పత్రాలను తగలబెడుతున్న రైతు సంఘం నేతలు, నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నేతలు

తిరుపతి అర్బన్: జాతీయ వ్యవసాయ మార్కెట్ ప్రైవేటీకరణ చేయడానికి తీసుకొచ్చిన జీవోలను కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నేతలు సోమవారం తగలబెట్టారు. ఈ సందర్భంగా పోలీసులు హాజరై అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కలెక్టరేట్ గేటు వద్ద గందరగోళం నెలకొంది. అనంతరం రైతు సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు. రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు మాగంటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లే వాల్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలను అణివేయడం సాధ్యంకాదని హెచ్చరించారు. గతంలో తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను రద్దు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చిన సంగతిని గుర్తుచేశారు. అయితే వాటిని రద్దు చేయకుంజా కొత్తగా జాతీయ వ్యవసాయ మార్కెట్లను ప్రైవేటీకరణ చేయడాన్ని తప్పుబట్టారు. అనంతరం జేసీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ మయూరా షుగర్స్ బకాయిలను రైతులకు ఇప్పించాలని, ఐదేళ్లుగా పోరాటం చేస్తుంటే రూ.16 కోట్లు మాత్రమే ఇచ్చారని, ఇంకా రూ.30 కోట్లు ఇవ్వాల్సి ఉందని వివరించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా నేతలు విశ్వనాథం, వెంకటరత్నం, పద్మనాభం పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- స్మగ్లర్ అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా, బాలపల్లి అటవీ ప్రాంతంలో మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జీ.బాలిరెడ్డి, వీ.శ్రీనివాసులురెడ్డి, ఎండీ షరీఫ్ నేతృత్వంలో రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కే.అల్లిబాషా ఆదివారం సాయంత్రం బాలపల్లి అటవీ ప్రాంతంలోని గుంజనా సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. గంగరాజుపల్లి సమీపంలోని సున్నపురాళ్ల కోన వద్ద ఒక వ్యక్తి తచ్చాడుతూ కనిపించాడు. అతని వద్ద ఉన్న మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఆ వ్యక్తిని అరెస్టు చేసి, తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్సు పోలీసు హెచ్‌సీ.సుబ్రమణ్యరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా చేపల వేట

- మంగళం చెరువులో మత్స్య దోపిడీ
- గడువు పూర్తయినా వదలని కాంట్రాక్టర్
- వేలం నిర్వహించకుండా కొమ్ముకాస్తున్న అధికారులు
- పంచాయతీ ఆదాయానికి భారీగా గండి



మంగళం చెరువు



చేపలు విక్రయిస్తున్న దృశ్యం

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. అయినవారికి ఆకుల్లో.. కానివారికి కంచంలో వడ్డించిన చందంగా వ్యవహరిస్తున్నారు. మంగళంలోని న్యూ మంగళం పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో చేపల వేటను గమనిస్తే అదే నిజమనిపిస్తుంది. ఈ చెరువులో చేపల వేటకు వేలం గడువు ముగిసి ఆరునెలలవుతోంది. అయినప్పటికీ గతంలో వేలం పాడుకున్న కాంట్రాక్టర్ గంగాధరం చేపల వేటను పర్యవేక్షిస్తున్నాడు. ఇష్టారాజ్యంగా మంగళం చెరువులో చేపలు పట్టించి యథేచ్ఛగా విక్రయించేస్తున్నాడు. దీంతో పంచాయతీ ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడుతోంది. ఇంత జరుగుతున్నా సదరు పంచాయతీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇందులో అధికారులకు భారీగానే ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి వచ్చిందో లేదో కానీ, పంచాయతీ అధికారులు మాత్రం చెరువుకు వేలం నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారు. గతంలో ఈ చెరువులో చేపల వేటను రూ.9.5లక్షలకు వేలం వేశారు. ఇప్పుడు అంతకు రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశముంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మంగళం చెరువుకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.